# పోక్సో కేసులో ఇద్దరు ముద్దాయిల అరెస్ట్..

## కోర్టు రిమాండ్

తొలి సమయం మహబూబాబాద్/దంతాలపల్లి/ జూలై 30:

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పోక్సో కేసులో ఇద్దరు ముద్దాయిలను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచారు, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపినట్లు దంతాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మంగళపల్లి శ్రీనివాస్ (24), తండ్రి శ్రీను, ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసి ఆమెను తన వెంట తీసుకెళ్లినట్లు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ...దంతాలపల్లి పోలీసులు పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ముద్దాయి మంగళపల్లి శ్రీనివాస్‌ను గుర్తించి నిన్న అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అధికారికంగా అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. అదే కేసులో ప్రధాన ముద్దాయి శ్రీనివాస్‌కు, మైనర్ బాలికకు ఆశ్రయం కల్పించినట్లు దర్యాప్తులో తేలడంతో మంగళపల్లి గంగాధర్, తండ్రి శ్రీనును నేడు పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కూడా కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు పంపింది. ఈ సందర్భంగా దంతాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై మాట్లాడుతూ, పోక్సో కేసుల్లో నిందితులకు లేదా మైనర్లను తీసుకెళ్లిన వారికి ఆశ్రయం కల్పించే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు ఆశ్రయం కల్పించడం కూడా నేరమేనని, అలాంటి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై తెలిపారు.




# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

తొలి సమయం మహబూబాబాద్ జూలై 30

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి డి.జి.పి. సి.వి.ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితులు, చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీసీ కి కలెక్టరెట్ లోని మినీ కాన్ఫెరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ వీసీ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 24×7 పని చేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల లోని వరద ప్రభావిత ప్రాంతాలలో మోహరించి పూర్తి అప్రమత్తంగా ఉంచామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పని చేసేలా చర్యలు తీసుకోవాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్



యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, జీరో క్యాజువాలిటీస్ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రాష్ట్ర డి.జి.పి. మాట్లాడుతూ జిల్లా పోలీ సు అధికారులు తప్పనిసరిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను అనుసరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సమావేశం ఏర్పాటు చేశారు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో జిల్లాలోని అధికారులు అం దరూ అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ,మండల స్థాయిలో విప త్తుల నివారణ సహాయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, మండలానికి ప్రత్యేక అధికారులను, తహసిల్దారులు, ఎం పీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ పంచాయతీరాజ్ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, ఏలాంటి విపత్కర పరిస్థితులు వచ్చిన ఎదుర్కో వడానికి సిద్ధంగా ఉండాలని,గ్రామ పట్టణ స్థాయిలలో పాత భవనాలను గుర్తించాలని ఇప్పటికే ఆ ప్రక్రియ కొనసాగు తుందని, సంబంధిత భవన యజమానులకు నోటీసులు అం దించి అవసరం ఉన్నచోట షిఫ్ట్ చేయాలని, సూచించారు, ఇరిగేషన్ వారు చెరువులు, కుంటలు, కెనాల్లు, తదితర నీటి ప్రవాహాన్ని గుర్తించి బ్రీచేస్ అయిన వెంటనే చర్యలు తీసు కోబోయే విధంగా సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని, పశు, పంట, ఆస్తి, నష్టాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు,

వరదలు వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నెంబర్ 79950 74803 ఏర్పాటు చేసి సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉం చాలని ఆదేశించారు, గత సంవత్సరం వర్షాల నేపథ్యంలో జరి గిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో అధికారులు సిద్ధంగా ఉండాలని, ప్రధాన కార్య స్థానంలోనే ఉంటూ పరిస్థితిని గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ కాన్ఫెరెన్స్ లో డి.ఆర్.ఓ నాగలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ఇరిగేషన్, సంబంధిత అన్ని వివిధ శాఖలకి చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 31లోగా ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్‌ఓలకు అందజేయాలి

### ఎస్ఐఆర్ సవరణ కార్యక్రమం డిజిటలైజేషన్, ప్రక్రియ పై రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్



తొలి సమయం మహబూబాబాద్ జూలై 30

జిల్లాలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సవరణ, డిజిటలైజేషన్ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో నిమగ్నమై బూతు లెవెల్ అధికారులు, బూతులు సూపర్వైజర్స్, జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులు, పనిచేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఇప్పటికే గుర్తించబడిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు (బి ఎల్ ఏ), క్షేత్రస్థాయిలో సిబ్బందికి సహకారం అందించాలని, ప్రతీ ఓటర్ లో చైతన్యం కల్పించాలని, ప్రతి ఒక ఓటరు తాము నింపిన ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా 31, జూలై నాటికి సంబంధిత బూతు లెవల్ అధికారులకు అందజేయాలనికలెక్టర్ కోరారు, అనంతరం ఆగస్టు మూడో తేదీ లోపు మీరు అందజేసిన ఫారాలను డిజిటలైజేషన్ చేయబడతాయని తెలిపారు, ఆలస్యం చేయకుండా త్వరగా మీ వద్ద ఉన్న ఫారాలను నింపి సంబంధిత డీఎల్ఓ లకు అందజేసి మీ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం ఏర్పాటు చేశారు, ఫామ్ల డిజిటలైజేషన్ ప్రక్రియ బూతు లెవల్ లో కాకపోతే వెంటనే ఈ ప్రత్యేక కేంద్రాలలో సంప్రదించాలని, ఆయన సూచించారు, ఎస్ ఐ ఆర్ సవరణ,డిజిటలైజేషన్ ప్రక్రియ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా సమన్వయంతో కలిసి పనిచేసి తేదీ. జూలై 31 లోపు జిల్లా లక్ష్యంగా పూర్తి చేయాలని సూచించారు,ప్రతి ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫామ్ పూర్తిచేసి సంబంధిత బూతు లెవల్ అధికారికి గాని, కార్యాలయాల్లో గాని సబ్మిట్ చేయాల్సి ఉంటుందని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని గుర్తించాలని ఆయన సూచించారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఆర్డీవోలు గణేష్, రాజేశ్వరి, రాజకీయ పార్టీ ప్రతినిధులు బీఆర్ఎస్ ఎం.వెంకన్న, కాంగ్రెస్ సురేష్ నాయుడు, బిజెపి శ్యాం సుందర్ శర్మ, టిడిపి పి. రామారావు, బీఎస్పీ విజయ్, రాజమౌళి సిపిఎం, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన పంట మార్పిడి ప్రచారం

### ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

### ఆయిల్ పామ్, ఉద్యాన పంటలతో అధిక ఆదాయం సాధించాలి

### జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న

తొలిసమయం, మహబూబాబాద్, జూలై 30 :

ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా అధిక ఆదాయం వచ్చే ఆయిల్ పామ్, ఉద్యాన, కూరగాయలు, పండ్లు, పూలు, మల్బరీ వంటి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమల అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రాజెక్ట్ వైవిధ్యం పంట మార్పిడి కార్యక్రమంలో భాగంగా గురువారం కురవి, నారాయణపురం గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుతో ఎకరానికి సుమారు రూ. 2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని, ముదురు తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేస్తే అదనంగా రూ. 25 వేల వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం 9,500 ఎకరాలకు చేరుకుందని చెప్పారు. ఆయిల్ పామ్ తోటల్లో మొదటి నాలుగేళ్లు బొప్పాయి, జామ, కూరగాయలు, వేరుశనగ, పప్పుధాన్యాలు, నువ్వులు, మిరప, చిరుధాన్యాలు వంటి అంతర పంటలు సాగు చేయవచ్చని, ఆ తర్వాత కోకో, మిరియాలు, అనాస, వక్క, జాజికాయ వంటి అధిక ఆదాయం ఇచ్చే పంటలు సాగు చేయవచ్చని వివరించారు.



ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి రూ. 50,918 వరకు, కోకో అంతర పంటకు రూ. 8,600 వరకు రాయితీ అందిస్తోందని తెలిపారు. కురవి గ్రామంలో రైతు మేక వెంకట్‌రెడ్డి ఆయిల్ పామ్ తోటలో 10 ఎకరాల్లో కోకో మొక్కలను అధికారులు, శాస్త్రవేత్తలు కలిసి నాటగా, నారాయణపురంలో ఆయిల్ పామ్, మామిడి, కూరగాయల తోటలను సందర్శించి రైతులకు యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. అలాగే పంట మార్పిడి, ప్రకృతి సేద్యం, తక్కువ నీటితో అధిక ఆదాయం పొందే పంటల సాగుపై దృశ్య, శ్రావణ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయచంద్ర,పి. మురళి వ్యవసాయ సహాయ సంచాలకులు, మరిపెడ, ప్రధాన శాస్త్రవేత్త డా. దిలీప్, ఉద్యాన శాస్త్రవేత్త సుహాసిని కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, డా. ప్రశాంత్, ప్రధాన శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల, మండల వ్యవసాయ అధికారి జి. నరసింహ రావు, ఉద్యాన అధికారి ఆర్. శాంతిప్రియ, కోకో కంపనీ ప్రతినిధులు టి. లక్ష్మణ్ కుమార్, మహేష్, విస్తరణ అధికారులు విజేందర్, రజనీకాంత్, టి. విజయపాల్ రెడ్డి, బి. రమేష్, ఆయిల్ ఫెడ్ క్షేత్ర అధికారి బి. నాగరాజు, బిందు సేద్య ప్రతినిధులు ఆగస్టిన్, కారంత్, సర్పంచ్ భాస్కర్, ఉప సర్పంచ్ చందు, కార్యదర్శి నిరోష, రైతులు యం.వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, వీరా రెడ్డి, శ్రవణ్ కుమార్, రామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ సాంగ్ షూటింగ్‌కు శ్రీకారం

### - మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభం





తొలి సమయం పెబ్బేరు జూలై 30

వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ గంగమ్మ దేవాలయం మరియు శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయాల్లో నేటి లీడర్ మ్యూజిక్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న బోనాల పండుగ ప్రత్యేక సాంగ్ షూటింగ్‌ను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్గౌడ్ప్రారంభించారు. తెలంగాణ సం స్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందుతున్న ఈ బోనాల జాతర సాంగ్ పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, జర్నలిస్ట్, జి. బాలవర్ధన్ సాహిత్యం అందించగా, కొరియోగ్రాఫర్ మాస్టర్ నవీన్ ఆధ్వర్యంలో చిత్రీకరణను వైభవంగా నిర్వహించారు. షూటింగ్ సందర్భంగా మహిళలు బోనం కుండలను తలపై మోసుకుంటూ, చిన్నారులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని సందడి చేశారు. డప్పు, జమ్మడిక వాయిద్యాల నడుమ తెలంగాణ జానపద కళారూపాలను ఆవిష్కరిస్తూ చిత్రీకరణ అద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు స్థానిక ప్రజలు, భక్తులు చిత్రీకరణను ఆసక్తిగా వీక్షించారు. త్వరలో ఈ బోనాల జానపద గీతాన్ని నేటి లీడర్ మ్యూజిక్ ఛానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# మొక్కతోనే భవిష్యత్తుకు భరోసా




### టాటా ఏఐఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

తొలిసమయం, కొత్తగూడెం జులై 30 :

పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంతో టాటా ఏఐఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ కొత్తగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలోని శ్రీ సాయిరామ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అడ్వైజర్ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న 150 మంది అభ్యర్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కల పెరుగుదలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, మొక్క నాటిన ఫొటోలు, వాటి సంరక్షణకు సంబంధించిన చిత్రాలను అందులో పంచుకోవాలని కోరారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ లక్ష్యం ప్రతి కుటుంబానికి వారి అవసరాలకు తగిన జీవిత బీమా రక్షణ అందించడమేనని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ప్రతి ఇంటికీ బీమా సేవలను చేరవేయాలనే సంకల్పంతో అడ్వైజర్లను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించడం, గాలి కాలుష్యం తగ్గడం, ఉష్ణోగ్రతలు నియంత్రణలో ఉండటం, వర్షపాతం మెరుగుపడటం, నేల కోత నివారణతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణకు కూడా ఎంతో దోహదపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ శర్మ, బ్రాంచ్ బిజినెస్ అసోసియేట్ మేనేజర్ రాహుల్, సునీత, లీడర్లు తారప్రసాద్, కేశవరావు, మహేష్, ఉమాకర్, నాగులు, మీరా, రమేష్, రవీందర్, శివలీల, బాబురావు, కృష్ణార్జున, బొర్రా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరణకి సహకరిస్తా

### ఎస్పీ శబరిష్

### - టీఎస్ జేయు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత

తొలిసమయం, మహబూబాబాద్, జులై 30 :

జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరణకు సహకరి స్తానని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ యూనియన్ జిల్లా నాయకులతో కలసి జర్నలి స్టుల దాడుల నివారణ కమిటీ పునరుద్ధరించాలని కోరుతూ వి నతి పత్రాన్ని జిల్లా ఎస్పీ డా.శబరీష్ ఐపీఎస్ కి అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీ నీ పునరుద్ధరించడానికి కావలసిన విధి విధానాలను సమీక్షించి కమిటీ ఏర్పాటుకు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిర్రగొని ఉదయ్ ధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి సతీష్ చారి, తదితరులు పాల్గోన్నారు.

# చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ





తొలిసమయం, పాల్వంచ, జూలై 30 :

మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూతనందించే లక్ష్యంతో చేతన ఫౌండేషన్ మరియు గూడూరు ట్రస్ట్ ఆర్థిక సహకారంతో, కొల్లి ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు గురువారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భద్రాద్రి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత కుమారి, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ (ఎడ్యుకేషన్) ఎస్. వెంకటాచారి మాట్లాడుతూ, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచవచ్చని అన్నారు. సమాజాభివృద్ధిలో సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తూ మహిళా సాధికారతకు అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను అందజేసి, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు వెనిగళ్ళ అనిల్ కుమార్, దొడ్డ సీతారామయ్య, చంద్రకాని నవీన్,కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పన, రూప్లా నాయక్, పుల్లారావు పాల్గొన్నారు.